# హైద్రాబాధ

దూపాటి సంపత్కుమారాచార్య




ఒక్కో అప్పుడు మనం దేన్ని వద్దనుకుంటామో అదే అవసరమై కూర్చుంటుంది; కాకపోతే ఏవిటి చెప్పండి! అంతక్రితం 'ఎవరన్నా నోరు తెరచి 'అవధానిగారూ! మన అబ్బాయి ఏం చేస్తున్నాట్టూ?' అనో మన పెద్దబ్బాయి కేడ వున్నాడు ఏమి?' అనో అడిగితేచాలు అమలాపురం అవధానిగార్కి ఒళ్ళు మండి పోయేది. ఎవరినన్నా కొట్టాలన్నంత కోపంవచ్చి అవతల వాళ్ళా అంతపనీ చేయకపోరనీ భయంవల్ల తన పళ్ళన్నీ నోయేలా లోలోపలే కొరుక్కొని ఆ కోపమంతా చల్లారిన కాఫీని, ధర్మాసుపత్రిలో యిచ్చిన మందును ఒక్క గుటకలో మింగినట్లు దిగమింగేసి తన గొంతంతా విప్పి ఖంగుమనేట్లు.

'మా అబ్బాయా! ఏం చేస్తున్నాడనా అనేనా? అనటా నువ్వు అడిగేది? మూడు పూటలా భోంచేస్తున్నాడు. తెచ్చేందుకు వెధవ పీనుగుని నేనున్నానుగా' అనో, 'వాడా! ఎత్తు భారం పత్తికట్టా! రెండెకరాలు పండే పొలాన్నమ్మి యీ ఎదవ ఎదాన్నెట్టాను. 'ఉద్యోగం లేదు' అనే పంచాక్షరీ మంత్రం పారాయణం చేస్తున్నాడు. 'అనో' ఆ—ఆ—వున్నాడు లేకేం! అనటా అని నిక్షేపంలావున్నాడు. జవట పీనుగవా ఏవిట్రా! నువ్వు ఆ చదువుచెప్పిన వాళ్ళనే అడక్కపోయావ్! చవలాయి వెధవ్వి అనటా చెవలాయివనీ! నేనంటుంటే విన్పించుకుంటావా ఏమంటున్నానా?' అనో మావాడా? హా—హా—మా యింట్లో అనటా గుడ్డిగుర్రాలుంటేను; వాటికింత కచ్చిపెట్టి పళ్ళు తోమేస్తున్నాడు మూడుపూటలాను! అనో అనేస్తే అవధానిగార్కి యిప్పుడు వాళ్ళబ్బాయి గురించి ఎవరన్నా అడిగితే చాలుండునే! అదీ! ఇప్పుడెవరన్నా అడక్కపోతే ఆయనకు చచ్చేకోపం! చివరకు ఎవరూ అడక్కపోయినా సరే! తానే కల్పించుకొని అబ్బాయి విషయం ఎత్తుటానికి వింతో తిప్పలు పడతాడు.

పైన తెలిసినవాళ్ళకూ తెలియనివాళ్ళకూ చెవిటివాళ్ళకి చెప్పినట్లు—గట్టిగా నోరెత్తి పౌరాణిక నాటకాలలో కృష్ణ భీమాదులు హార్మోనిస్టు వంక తిరిగి ఆరున్నర అని గొంతెత్తి పద్యం ప్రారం-

[illegible] — బిలాగో అలా మా అబ్బాయి హైద్రాబాదులో కన్పించలేదుటయ్యా! చెవలాయిలా వున్నావే? అవటా చెవలాయిలాగా అనో !

'మిరియాల బండిలోనో — వ్రీర మండలంలోనో, ఉన్నాడట ! అబ్బాయిని చూపిరావయ్యా; హనుమంతయ్యా అంటే —అవటా తోకా తొండమూ లేకుండా వున్నావేం?' అనో—

'పళ్ళు రాలగొడ్తాను ? అవటా అని! చెప్పనోడెవరయ్యా హయిద్రాబాదులో మా వాడి సంగతి' అనో అనేసి వాళ్ళ కొడుకు హైద్రాబాదులో బాధపడే జనాభాలో ఒకడని తేర్చిపారేసి ఆయన అడ్రసు అదీ అడక్కపోయినా చెప్పేసి తన వ్రేళ్ళ ఉంగరాలు కన్పించేలాగా చేసేవాడు చేతులు త్రిప్పుతూ!

అవధానిగారి పెద్దబ్బాయి అంజనేయులు (తోక ఒక్కటే లేదట!) హయిద్రాబాదులో ఉద్యోగం దొరకగానే యిండ్ల వేట ప్రారంభించాడట! ఆయన అనుభవాలన్నీ మచ్చుకి కొన్ని ఆయన డైరీలో రాసుకున్న ప్రకారం యీ రచయితగాడు అందించాల్సి వచ్చింది. ప్రతిదానిముందూ వో యింటి యజమాని ఎవరో అన్నాడని, అష్టోత్తరశత పూజలో ప్రతి నామానికి ముందు 'ఓం' అనుకున్నట్లు అనుకోవాలి మరి !

(1) ఇదిగో యిది కామన్ కిట్చినం! యిటేపు మీరు వస్తే మా ఆడవాళ్ళూ వాళ్ళ స్నేహితులూ (వాళ్ళూ ఆడవాళ్ళేనా?) యిటు తిరుగుతుంటారు గాబట్టి పాయఖానా అమాంఖానా యింకోచోట చూసుకోండి!

(2) నీళ్ళనల్లా తొమ్మిది దాకానే వస్తుంది! చూస్తున్నారుగా కిర్సనాయిలుకు క్యూలోలాగా నీళ్ళకు క్యూ—మా వాళ్ళు వంట పని నాకు ఒప్పగించేసి నీళ్ళ పనే తాను చూసుకుంటోంది. అవతల పది గంటలకల్లా ఆఫీసుకు పోకపోతే మా ఆఫీసరు తన గ్రాండ్ ఫాదర్ సొమ్మంతా పోయినట్లు యేడుస్తాడు ! నాక్కూడా ఎక్కడన్నా ఒక్క గది చూడండి! ప్లీజ్. ఒక యింట్లోని గుమాస్తాగారి అభ్యర్థన!

(3) పిల్లలున్నాక ఎక్కడ పోతారూ? కాలకృత్యాలు తీర్చుగోటానిక ? లెట్రిన్ [illegible] క్యూలో [illegible] గనక? మా వారికి ఇల్లూ ఆఫీసూ ఒకటే! కలవరించినా ఆఫీసు లెక్కలే! కలల్లోనూ డ్రాఫ్టులే! ఇలా వుండండి - అన్నగారూ. మీరెలాగూ యింకో యిల్లు చూడదలచుకున్నారా?—మాకు మీకూ కల్పి మరీ చూడండి. వో ఏకాంటంటు ఏకాంబరం గారి భార్య రిక్వెస్టు.

(4) మీరీ గదిలో వుండచ్చు. కాని మీరు మరీ పొడుగుగా వున్నారే ! చూరు తగుల్తుంటుంది—తలకు ! పడుకొనేప్పుడు ముడుచుకొనే పడుకోవాలి! కాళ్ళు జాపితే గోడలకు దెబ్బ! యీ యింట్లో యిది వరకు ఉండే ఆయన ముడుచుకొని పడుకోవటంలో కొత్త ఆసనం కని పెట్టి సూక్ష్మ శరీరం ఎలా ధరించాలో ప్రదర్శనలు యిండియా అంతా యిచ్చి అమెరికా ప్రదర్శనలో వున్నారు. మరి మీ యిష్టం. యీ గదికీ 40 రూ. చొప్పున మూడు నెలల అద్దె అడ్వాన్సు యిచ్చేయాలి! మరి!

(5) మీరు త్వరలో ఫామిలీతో దిగేయండి. ఈ గదిలోవున్న ఒకాయన యిప్పటికి ఆరునెలలుబట్టి ఐపులేడు...ఆయన గురించి వాకబుచేస్తే దానికన్నా మీబోటి వాళ్ళు నల్గురిఎదుట తాళం బద్దలు కొట్టేస్తాను. ఫామిలీని తేవటం ! మర్చిపోకండి !

పడుచుభార్యను కల్గివున్న వో ముసలి భర్త ఉవాచ.

(6) రండి. రండి. మీరు మూడో వారే! ఈ కాయితంమీద మీ అడ్రసూ. మీ ఆఫీసూ. రాసేయండి. అద్దె ఒక్కటే ఎక్కువవుతుంది ప్రతినెలా మీరు అద్దె యివ్వటానికి అభ్యంతరం వుంటుందేమో! మీరు మీ ఆఫీసరుగార్నే డైరెక్టుగా మీ జీతంలోంచి అద్దెయిమ్మని ముక్త్యార్ నామా (పవర్ ఆఫ్ లెటరు) రాసి ఉంచండి. మీ పై వాళ్ళిద్దరూ వరసగా తీసుకొని ఖాళీచేశాక మీవంతు వస్తుంది !

(7) మీరేనా ఈ గదిలోకి వస్తామని యిందాకణ్ణుంచి యింటివాళ్ళతో మాట్లాడేది—నాకు ఖాళీ చేసేందుకేం అభ్యంతరం లేదండి ! యిది ఫైనలీయరాయె ! కాస్త రిక్రియేషన్ లేకుంటే క్లాసురాదు. ఈ యింటి యజమానికి యమధర్మరాజా పోస్టుకు సరిపోయిన క్వాలిఫికేషన్స్ వున్నాయ్ ! యిప్పుడా యమధర్మరాజా అక్కడ ఉన్నాయి యిక్కడ పోస్టులు వుంటాడు. ఆయన కూతురుందే! ఆమె బెంగాలీ వాళ్ళకు రసగుల్లాలాంటిది. ఆమె అలా కిటికీ ముందు నిల్చుంటే చాలు 'మావేద వేలనే ప్రణయ సుందరి !' అనే సినీ పద్యాలు వచ్చేస్తాయి నాకు ! అంచాత బాబ్బాబు ! నాకు అడ్డురాకండి మార్చిదాకా! ఈలోగా నేను వాళ్ళ అల్లుణ్ణి కాలేకపోతే. ఖాళీ చేస్తాను.

(8) ఈ గది మామూలుగా వుంది. ఆరుగంటలు సాయంత్రం అయితేచాలు ! రాత్రి అయినట్లే — సింహద్వారం మూసేసి — భల్లూకంలాంటి కుక్కను కాపలా పెడ్తుంటాం ! అది దవడలు దగ్గర పడేలా ఈలవేసినా — కండ పీకి గాని వదలదు మరి ! ఆ కుక్కకు రాత్రిళ్ళు రేజీకటి ! కొత్త పాతా ఏది తెలీదు !—ప్రొద్దున్నరావటం. సినిమాలకి తిరగటం మానుకోవాలి. రాత్రిళ్ళు గాలి లేదని చక్కర్లు గొట్టటం—ఇలాంటివేం కుదరవగ్గాయి.

శ్రీమతి సింహాద్యాక్షమ్మగారు పెట్టిన సవాలక్ష కండిషన్లు.

చివరకు ఒకే ఒకగది తడికలతో మూడుభాగాలు చేసుకొని—ఒకటి పడక్కి ఒకటి వంటకి—యింకోటి కోపగృహానికి చేసేసుకుని — మునిసిపాలిటీ (మ్యునిసిపాల్టీ) ధర్మమా అని నల్లప్రొద్దుటే బందయితే బజారు నల్లాలోంచి తెచ్చుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు అంజనేయులు యింటికి మూడు స్టేజీల దూరంలో ఆఫీసూ, ఐదు స్టేజీలదూరంలో. ఉందిట. (ఇప్పుడు దూరాన్ని ముందు మైళ్ళలోగాని, కిలో మీటర్లలోగాని కొల్వరట హైద్రాబాదులో బస్సుస్టేజీల లెక్కల్లో చెప్పగుంటారు)

హయిద్రాబాదులో బస్సు జనానికి డ్రయివరుతో పనిలేదట ! అతడు దాన్ని ఆపినా ఆపకపోయినా ఎక్కి దిగటంలో కావల్సినంత స్వేచ్ఛ వుందిట ! అసలు యిలా నడుస్తున్న బస్సులోంచి దిగటం—ఎక్కటం—స్కూల్లో కె. జి. క్లాసులో చదివే పిల్లల దగ్గర్నుంచి అందరికీ నేర్పిపెడతారుట ! అందుకని బస్సుకు నంబ

ఠించి ఊడిరాని ఏ ఊచనైనా సరే అలా పట్టుకొని ఎంతదూరమైనా త్రిశంకు స్వర్గంలో వూగుతూ ప్రయాణం చేసేస్తుంటారట! హయిద్రాబాదులో! అసలు కొందరు రష్ లేని బస్సు ఎక్కరుట బస్సు స్టేజీ దగ్గర అసలు హయిద్రాబాదుకు చెందిన ఏ నరుడూ వెయిటూ చేయడుట! ఆ స్టేజీకి అరమైలు ముందో వెనకో తప్ప ఏ తెలివిగల డ్రయివరూ బస్సును ఆపడట!

ఆంజనేయులుగారు బస్సుకోసం స్టేజీలో నిలబడి విసుగెత్తిపోయారు. బస్సులు రావటంలేదని కాదు! ఊరేగింపుకుమల్లే రావటం!...ఆగకుండా పోవటం! ఆంజనేయులుకు ఆశ్చర్యం వేసింది. తనతో నిల్చున్న నల్లకళ్ళద్దాలమ్మాయి, ఎదురుచూసిన వాలుజెడ వయ్యారీ, ఆ కదిలిపోతున్న బస్సులోకి ఎలా! బట్టలు కూడా నలగనంత సునాయాసంగా ఎక్కేశారు. అంచేత ఆంజనేయులుగారు వస్తున్న వో బస్సు బయటికి నల్లగా ఊచలాగా కన్పడుతున్న వో ముసలమ్మ చెయ్యి బలవంతంగా పుచ్చుకొని పాణిగ్రహణం లాంటిది చేయటంతోటే ఆ ముసలమ్మ తాను


# హైద్రాబాధ

క్రింద పడేప్పుడు తన మూట మాత్రం పైనెందుకని మరో చేత్తో ఆ మూట పుచ్చుకోబోయింది. అందులోని తినుబండారాలన్నీ ఎప్పటినుంచో తింటున్న వో ఎలక పిల్లకి ఆ ముసలమ్మ చేసిన దురాక్రమణం సహించక ఒక్కసారే బయటికి రాబోయి మెత్తగా తగిలింది.

దాంతో ఆ ముసలమ్మ 'చచ్చాను బాబోయ్' అని ఒక్క అరుపు అరిచింది. దాంతో ఆ ఎలకపిల్లకి ఏం చెయ్యాలో తోచక ఎగిరి గంతేసి, నోటినిండా జర్దా కిల్లీ తాలూకు లాలాజలం నింపుకొని ఎక్కడ ఎప్పుడు ఉమ్మేయ్యాలో తెలీక బాధపడుతున్న బోసిదవడల బుచ్చెయ్యకోటు జేబును తన కన్నం అనుకొని ప్రవేశించబోయిందిట. బుచ్చయ్యగారికి రెండు వస్తువులంటేనే భయంట. ఒకటి చావూ రెండోది ఎలకాను! ఆయన చెయి విదిలించుకొంటే ఆ చెయి పొరపాటున వెళ్ళి ఆయన వెనకే నుల్చుని యిటు తిరిగి వక్రచూపులు చూస్తూ వో పడుచును ఊరిస్తున్నట్టు పాంటు ధరించిన మెడికల్ కాలేజీ స్టూడెంటు చంద్రకాంత ముక్కుకు సూటిగా తగిలింది. దాంతో ఆ ముక్కు కాస్తా అందుకోసమే వెయిటు చేస్తున్నట్లు ధారాపాతంగా రక్తాన్ని బయటికి చిమ్మేసింది. దాంతో ఆ కుర్రాడు తనమీద దండయాత్రచేసిన బుచ్చెయ్యగారిని పళ్లు రాలగొడ్దామని చూస్తే ఆయనకి పళ్లు లేవని జ్ఞాపకం వచ్చి, ప్రక్కనే కర్ర ఊతంగా ఉంటేనేగాని నిలుచోలేని కాంతయ్యగారి కుడిచేతిలో ఆధారంగావున్న — ఆ వాకింగ్ స్టిక్‌ను గుంజుకోబోతే ఆయన తలెత్తి రక్తమండలం అయిన చంద్రకాంత మొగాన్ని చూడలేక ప్రక్కకు వున్నవారిమీద మూర్ఛోయి పడ్డాడట!

దాంతో ఆ ఎలక ఎవర్ని చూసి, వాళ్లే కొంపమునిగేలా అల్లరి చేయటంతోటే డ్రయివరు చక్రపాణిగారి జేబులో నన్నా దూర్దాం అని — ఆయన కోటు జేబులోకిపోయి సురక్షితంగా కూర్చుందిట.

ఆ చక్రపాణిగారికో దురలవాటుట! ఆయన జేబులో తినుబండారాలుంటేనే గాని ఆయన డ్రయివ్ చేయలేరట! — అందుకని ఆయన జేబులో చెయి పెట్టంగానే ఎలకగార్కి చక్కిలిగింతలెత్తి గంతేసింది — దాంతో జేబులో వున్నది పామో — అంతకన్నా పెద్ద విషజంతువో తెలీక — ఆయన కోటు విప్పి వెనక్కి గిరవాటేస్తే, తాను దిగాల్సిన చోటేమోనని చూస్తున్న శాస్త్రులుగారి మొగాన్ని ఆ కోటు కప్పేసింది. ఇంత హఠాత్తుగా తన నెత్తిన విరుచుకపడ్డ ఆ కోటునేదో ఆకారం అనుకొని శాస్త్రులుగారు చచ్చాప్రోయ్ అని అరచి ఆ ముసుగులో చేసిన క్రొత్త రకం డ్యాన్సుకు హడిలి ఆ ఎలక తిన్నగా యిద్దరి ముగ్గురు నెత్తులమీద మంచి ప్రయాణం చేసేసింది. ఈ కంగారులో చక్రపాణిగారు ఎటు త్రిప్పాలో తెలీక రోడ్డుప్రక్కనే తల్పులు తీసివున్న వో గవర్నమెంటు హాస్పటలులోకి



త్రిప్పేస్తే ఆ బస్సు యిక పేషంటు వార్డుదాకాపోయి అప్పుడు సడెన్‌బ్రేకు వేశాడన్న సంగతి జ్ఞాపకం వచ్చినదాని లాగా చటుక్కున ఆగిపోయిందిట!


దాంతో ఆ హాస్పటలులో ఎన్నాళ్ళకి రోగం తగ్గకపోయినా చావుకే ఎదురు చూస్తున్న రోగులు తమ తమ బెడ్లను వదిలేసి పారిపోయి సురక్షిత ప్రాంతాల్లో దాక్కున్నారట.

దాంతో ఆంజనేయులుగారు ముందు క్రింద పడ్డారట. కొప్పులో ఏదో కదులుతున్నట్టు అన్పించిన వో కోమలాంగి కొప్పు సర్దుకోబోగా ఆమె కొప్పులో పూలదండతో బాటు ఎలకపిల్లా రావటం తోటే — ఆమె హఠాత్తుగా వెనకవారి మీద విరచుక పడటంతోటే తతిమా వాళ్ళ వో అరడజను మంది క్రింద టపా టపా రాలిపడటం తోటె — క్రింద పడ్డ ఆంజనేయులుగారు తాను తప్పకుండా చనిపోయి వుంటానని — లేవదీయటానికి వచ్చినవాళ్ళు యమధర్మరాజా దూతలై వుంటారని అనుమానంతో.

ఎంతవరకూ వచ్చాం? వైతరణి దాటామా! అని అడిగాడు. వైతరణో — వల్లకాడో — బస్సు హాస్పటలు దాటందే! డ్రయివరు చాలా మంచివాడు. గాబట్టే హాస్పటల్‌లో బెడ్డుల దగ్గరే తెచ్చి పడేశాడు —

అని కొంతమంది నసిగారు. అసలింత జరగటానికి వో ఎలకపిల్లే కారణం అని తెలిసినప్పటినుంచీ అందరితో పాటూ డ్రయివరూ నవ్వేశాడు.

ఆంజనేయులు యిదంతా అవధాని గార్కి రాసేస్తే ఆ వుత్తరం తాలూకు అసలు కాపీ ఈ రచయితగాడు సంపాయించి ఈ కథ రాసి పారేశాడు. ఇంత బాధ హాయిద్రాబాధలో వుందని అప్పుడు గాని తెలిసిరాలేదు మరి! ●




రంగుల రాట్నం

జువ్వి కోనేటిరావు

ప్రపంచంలో అన్నిటి కన్నా ముదుసలి జీవి ఏదీ అంటే సెక్వోయా చెట్టు అని చెప్పుకోవాలి. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఎన్ని సంవత్సరాల క్రితం నివసించారో చెప్పలేము కాని [4, 5 వేల సంవత్సరాల క్రితం ఉండేవారని అభిజ్ఞుల అభిప్రాయం] బహుశా క్రైస్తు, బుద్ధుడే కాక శ్రీకృష్ణుడు బహుశా శ్రీరామచంద్రుడు కాలం నించి ఉన్న చెట్లు ఇవి.

సెక్వోయా రెండు జాతు లున్నాయి. సె. సెంపర్‌వైరెన్సు అనే 'ఎర్రచెక్క', సె. జైగాన్‌షియా అనే రాక్షస వృక్షం.' ఈ రెండు అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం లోని పసిఫిక్ మహాసముద్ర తీరాన ఉన్నాయి. ప్రస్తుతానికి ఈ ప్రాంతానికే పరిమితమై ఉన్నాయి. కోట్ల సంవత్సరాల క్రిందట ఆసియా, యూరపుఖండాల్లో కూడా చాల చోట్ల ఉన్నట్లు శిలాజాల ద్వారా తెలిసింది.

ఇప్పటి కొన్ని జైగాన్‌షియా చెట్లవయసు కనీసం 4 వేల సంవత్సరాల వరకు ఉంటుంది. ఆ జాతిలో ఒకానొక చెట్టు "మొదట" చుట్టు కొలత 100 అడుగులు మించి ఉంది. కనీసం 20 మంది, చెయ్యి చెయ్యి పట్టి దానిచుట్టు నిలబడొచ్చు. ఎత్తు 270 అడుగులు. 130 అడుగుల ఎత్తున ఉండే ఒక కొమ్మ వ్యాసం 6 అడుగుల మించి ఉంటుంది. అంటే ఒక పెద్ద మర్రిచెట్టు అంత కొమ్మ ఉంటుంది. మొత్తం చెట్టు బరువు 6,167 టన్నులని అంచనా వేశారు. సెంపర్ వైరన్సు చెట్టు లావు తక్కువ అయినా పొడవు ఎక్కువగా ఉంటుంది. ఆ జాతిలో ఒకానొకదాని ఎత్తు 364 అడుగులు! ఈ జాతి చెట్టు కలప చెడిపోకుండా చాలకాలం ఉంటుంది. దీనినుంచి సుందరమైన కలప పరికరాలు చేస్తారు. (అందుకే ఎర్రచెక్క అంటారు)

కనీసం 2,000 సంవత్సరాలైనా జీవించగల్గే ఈ చెట్లు ఈ రోజుల్లో చిన్న వయసులో — అంటే 6, 7 వందల సంవత్సరాల లోనే — చనిపోతున్నాయని శాస్త్రజ్ఞులు ఆందోళనతో కారణాలు అన్వేషిస్తున్నారు. ఆదేమో కాని రాక్షసి పరిమాణం పొందిన జంతుజాతులకు ఇదే గతి పట్టి నాశనమై పోయినట్లే ఇవి కూడా నిశ్శేషమై పోతా యేమోనని శాస్త్రజ్ఞులు అనుమానపడడం, ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసికోవడం జరుగుతోంది. సుమారు 50, 60 ఏళ్ల బట్టి ప్రత్యేకం శ్రద్ధ వహిస్తున్నారు. కాని అప్పటికే చాలమట్టుకు కలపకోసం వీటిని నాశనం చేశారు. మరో విషయం పసిఫిక్ మహాసముద్ర తీరం వెంబడి 450 మైళ పొడవునా ఎక్కడా సముద్రానికి 30, 40 మైళ్లకు మించకుండానే ఇవి ఉండడం ఆశ్చర్యకరమైనదే. ఈ మహావృక్షాలకి ఆ మహా సముద్రానికి అవినాభావ సంబంధం ఏదైనా ఉండే మోనని శాస్త్రజ్ఞులకు అనిపిస్తోంది.

చెట్లలోనించి కారులో పోవాలని సరదా ఉండేవాళ్ళు కాలిఫోర్నియాలోని ఈ చెట్లుండే ఒక పార్కుకి పోవాలి. అక్కడ ఈ చెట్ల లోంచి దొలిచి ఏర్పరచిన మార్గం ఉంది. దానిలోంచి కారు నడుపుకొని పోవచ్చు. ఐతే ఎందుకైనా మంచిది, కారుటాపుతీసి కొద్దిగా తలవంచుకొని పోతే క్షేమం అంటారు!